కులగణనపై బండి వ్యాఖ్యలు సరికావు

బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్

ఖైరతాబాద్, అక్టోబర్ 14 : కులగణన అయితదా...పోతదా అంటూ కేంద్ర మంత్రి బండి సంజయ్ వెటకారంగా మాట్లాడాన్ని ఖండిస్తున్నామని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీ సామాజికవర్గంలో పుట్టిన బండి సంజయ్ ఇలాంటి వ్యాఖ్యలు చేయడం యావత్ బీసీ సమాజం వ్యతిరేకిస్తున్నదని చెప్పారు. ఇప్పటికే ప్రధాని మోదీ ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు తీసుకువచ్చి బీసీలకు అన్యాయం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీసీ కులగణనపై ఆటంకాలు సృష్టించాలని చూస్తే ఊరుకోమని హెచ్చరించారు. 16న తెలంగాణ వ్యాప్తంగా జ్యోతిరావుపూలే, అంబేద్కర్ విగ్రహాలకు పుష్పాభిషేకం, 20న అఖిలపక్ష సమావేశాలు, 22న బీసీ మేధావులతో బీసీ కులగణనపై చర్చించి నిర్ణయాలు తీసుకుంటామన్నారు. సమావేశంలో బీసీ సంఘాల నాయకులు గణేశ్‌చారి, ఎస్ దుర్గయ్య గౌడ్, ప్రొఫెసర్ బాగయ్య, గూడూరు భాస్కర్, వెంకటేశ్‌గౌడ్ పాల్గొన్నారు.

కులగణనపై 24 నుంచి జిల్లా పర్యటనలు

బీసీ కమిషన్ నిర్ణయం

హైదరాబాద్, అక్టోబర్14 (నమస్తే తెలంగాణ) : కులగణనపై అధ్యయనం, అభిప్రాయాల సేకరణలో భాగంగా ఈ నెల 24 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా పర్యటించాలని రాష్ట్ర బీసీ కమిషన్ నిర్ణయించింది. బీసీ కమిషన్, ఉన్నతాధికారులు సోమవారం సమావేశమయ్యారు. కులగణన కోసం చేస్తున్న సన్నాహకాలను కమిషన్‌కు ప్రణాళిక శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా వివరించారు. బీసీ కమిషన్ పర్యవేక్షణలో కులగణన నిర్వహించాలని సమీక్షలో నిర్ణయించారు. త్వరలోనే నోటిఫికేషన్ జారీ చేయాలనే అభిప్రాయం వ్యక్తమైంది. బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్, సభ్యులు పాల్గొన్నారు

కడుపుకొట్టడమే కాంగ్రెస్ ఎజెండా

- **పేదల కడుపునింపడమే కేసీఆర్ ఎజెండా**
- **కాంగ్రెస్‌తో తెలంగాణ ప్రజల బతుకులు ఆగం**
- **రైతుబంధు ఎప్పడిస్తరో తెలియదు**
- **డిసెంబర్ 9వరకు రుణమాఫీ వాయిదా విడ్డూరం**
- **మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు**

సంగారెడ్డి జిల్లా అందోల్‌లో ఆలయ్‌బలయ్ కార్యక్రమంలో మాట్లాడుతున్న హరీశ్‌రావు

సంగారెడ్డి అక్టోబర్ 14 (నమస్తే తెలంగాణ): పేదల కడుపు నింపడం కేసీఆర్ ఎజెండా అయితే.. పేదల కడుపుకొట్టడమే కాంగ్రెస్ ఎజెండాగా మారిందని మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ప్రజల బతుకులను ఆగం చేస్తున్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు. సోమవారం సంగారెడ్డి జిల్లా అందోల్‌లో మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ అధ్యక్షతన జరిగిన ఆలయ్‌బలయ్ కార్యక్రమానికి శాసన మండలిలో ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి, మాజీ మంత్రి హరీశ్‌రావు ముఖ్య అతిథులుగా హాజరై ముందుగా జమ్మి చెట్టుకు పూజలు చేశారు. అనంతరం హరీశ్‌రావు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. తెలంగాణ ప్రజలు సంతోషంగా బతుకమ్మ, దసరా పండుగలను కూడా జరుపుకోలేని పరిస్థితిని కాంగ్రెస్ సర్కార్ తెచ్చిందని దుయ్యబట్టారు. పండుగపూట పేదలు కొత్త చీరలు లేకుండా ఉండవద్దని కేసీఆర్ బతుకమ్మ చీరలు పంపిణీ చేశారని గుర్తుచేశారు.రేవంత్‌రెడ్డి ప్రభుత్వం బతుకమ్మ చీరలనే పంపిణీ చేయలేదని, రెండు బతుకమ్మ చీరలు ఇస్తామని చెప్పి ఒక్కటి కూడా ఇవ్వకుండా పేద మహిళలకు పండుగ పూట కొత్త చీరలు లేకుండా చేశారని మండిపడ్డారు.

మంచినీళ్లు కూడా ఇవ్వలేరా?

ప్రజలకు మంచినీటిని సైతం సరఫరా చేయలేని దుస్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నదని హరీశ్ ధ్వజమెత్తారు. నారాయణఖేడ్‌లోని సంజీవన్‌రావుపేటలో కలుషిత నీరు తాగి ఇద్దరు మృతి చెందటంతోపాటు పెద్దసంఖ్యలో ప్రజలు అస్వస్థతకు గురికావడం ఆందోళన కలిగించిందని చెప్పారు. మిషన్ భగీరథ ద్వారా కేసీఆర్ పరిశుభ్రమైన తాగునీరు ఇస్తే కాంగ్రెస్ ప్రభుత్వం కనీసం ప్రజలకు మంచినీళ్లు కూడా ఇవ్వడం లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. కేసీఆర్ ఉంటే దసరా పండుగలోపు రైతులకు రైతు బంధు డబ్బులు ఖాతాల్లో పడేవని గుర్తుచేశారు. రూ.15వేల రైతుబంధు డబ్బులు ఇస్తామన్న రేవంత్‌రెడ్డి ఇప్పటికీ ఇవ్వలేదని, దసరాకు రైతుబంధు ఇస్తామని.. త్వరలోనే క్యాబినేట్‌లో నిర్ణయం తీసుకుంటామన్న ప్రభుత్వం ఇప్పటికీ ఆ దిశగా చర్యలు చేపట్టలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. పంట రుణమాఫీపైనా కాంగ్రెస్‌కు స్పష్టతలేదని, గతేడాది డిసెంబర్ 9న రైతు రుణమాఫీ చేస్తామని ప్రకటించిన రేవంత్‌రెడ్డి మాఫీ చేయలేదని, తర్వాత బడ్జెట్‌లో పెడతామని చెప్పి పెట్టలేదని, ఆగస్టు 15 వరకు చేస్తామని సగం మందికి కూడా మాఫీ చేయలేదని దుయ్యబట్టారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు వచ్చే డిసెంబర్ 9లోగా వందశాతం రుణమాఫీ చేస్తానని చెప్పటం విడ్డూరంగా ఉందన్నారు.

పదేండ్లు సుభిక్షం.. ఇప్పుడు దుర్భిక్షం : సిరికొండ

కేసీఆర్ పదేండ్ల పాలనలో ప్రజలంతా సుభిక్షంగా ఉంటే, ఇప్పుడు కాంగ్రెస్ పాలనలో దుర్భిక్షాన్ని ఎదుర్కొంటున్నారని శాసనమండలిలో ప్రతిపక్ష నేత మధుసూదనాచారి దుయ్యబట్టారు. తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలు చాలా గొప్పవని, తెలంగాణ గొప్పదన్ని చాటేలా మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్ ఏటా ఆలయ్ బలయ్ నిర్వహించటం ఆనందంగా ఉన్నదని తెలిపారు.

పార్టీ శ్రేణులు అధైర్యపడొద్దు : క్రాంతి కిరణ్

ఆలయ్‌బలయ్ నిర్వహించటం సంతోషంగా ఉన్నదని, ఇదే సమయంలో పార్టీకి చెందిన ఇద్దరు నాయకులు మృతి చెందటం బాధించిందని మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్ అన్నారు. అందోలు నియోజవకర్గ ప్రజల సమస్యల పరిష్కారం కోసం, అభివృద్ధి కోసం కృషి చేస్తూనే ఉంటానని, పార్టీ శ్రేణులు ఎవరూ అధైర్యపడవద్దని, అండగా కేసీఆర్, హరీశ్‌రావు ఉన్నారని తెలిపారు.

మరో పోరాటానికి ఆయుధ పూజ : రసమయి

మాజీ మంత్రి హరీశ్‌రావు చేసింది జమ్మిచెట్టు పూజ కాదని, మరో తెలంగాణ సాయుధ పోరాటానికి ఆయుధ పూజ అని మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అభివర్ణించారు.. ఈ ఆయుధాలను అందుకొని మళ్లీ తెలంగాణ ప్రజల ఆకాంక్షల కోసం ప్రతి ఒక్కరూ పోరాటం చేయాల్సిన అవసరం ఉన్నదని చెప్పారు. కాంగ్రెస్ పాలన చూస్తుంటే మళ్లీ పాతరోజులు గుర్తుకు వస్తున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. బీఆర్ఎస్ నేతలు విజయరామరాజు, అల్లం నవాజ్‌రెడ్డి మృతిచెందగా వారి చిత్రపటాల వద్ద హరీశ్, క్రాంతికిరణ్ నివాళులర్పించారు. అలయ్ బలయ్ కార్యక్రమంలో బిచ్కుంద పీఠం స్వామీజీ సోమయప్ప స్వామి, జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు, ఎమ్మెల్సీ యాదవరెడ్డి, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ మంజుశ్రీజైపాల్‌రెడ్డి, కార్పొరేషన్ మాజీ చైర్మన్లు దేవీప్రసాద్, ఎర్రోళ్ల శ్రీనివాస్, మఠం భిక్షపతి, డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చంటి రాహుల్, మాణిక్యం, జైపాల్‌రెడ్డి, బుచ్చిరెడ్డి, సోమిరెడ్డి, బాల్‌రెడ్డి, శ్రీకాంత్‌గౌడ్, మనోహర్‌గౌడ్ పాల్గొన్నారు.

రాంగ్‌రూట్‌లో పోలీసింగ్!

- **స్టేషన్లలోనే మహిళా సిబ్బందికి రక్షణ కరువు**
- **ఎస్సై వేధింపులకు మహిళా ఏఎస్సై ఆత్మహత్యాయత్నం**
- **100కు కాల్ చేసిన మహిళను ట్రాప్ చేసిన హెచ్‌సీ**



హైదరాబాద్, అక్టోబర్ 14 (నమస్తే తెలంగాణ): 'పిల్లి గుడ్డిదైతే.. ఎలుక ఇల్లంతా తిరిగినట్టు' ఉంది రాష్ట్రంలో పోలీస్‌శాఖ పరిస్థితి. పోలీసు స్టేషన్లలోనే సెటిల్‌మెంట్లు, మహిళా సిబ్బందిపై లైంగికదాడియత్నాలు, ఇసుకాసురులతో దోస్తానాలు, స్టేషన్‌కు వచ్చే మహిళలను ట్రాప్ చేయడాలు.. అనుకూలమైన నాయకులు వస్తే సకల మర్యాదలు, కేక్ కటింగ్‌లు, అవసరమైతే మందుపార్టీలు నిర్వహిస్తూ పోలీసుశాఖకు మచ్చ తెస్తున్నారు. డ్యూటీ పేరిట టైమ్ పాస్ చేసేవారిని, అవినీతి ఆరోపణలు ఉన్నవారిని వదిలేసి.. నిజాయితీ అధికారులను వేధిస్తుండడంతో ఏం చేయాలో తెలియక, ఎవరికి చెప్పుకోవాలో పాలుపోక పలువురు ఆత్మహత్య చేసుకున్న ఘటనలూ ఉన్నాయి. ఈ విచిత్ర వైఖరి అన్ని జిల్లాల్లో కనిపిస్తున్నా, ఆయా కమిషనరేట్ల సీపీలు, ఎస్పీలు చర్యలు తీసుకోవడంలో విఫలమవుతున్నారు.

స్టేషన్లలోనే దారుణాలు..

మెదక్ జిల్లా చిలిప్‌చేడ్ ఎస్సై యాదగిరి అదే స్టేషన్‌లో పనిచేస్తున్న మహిళా ఏఎస్సైని కొంతకాలంగా వేధిస్తున్నాడు. ఈ విషయం పైఅధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేక స్టేషన్ ఆవరణలోనే ఆమె పురుగుమందు తాగిన ఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. వనస్థలిపురం స్టేషన్ పరిధిలో 100కు కాల్ చేసిన ఓ మహిళతో హెడ్‌కానిస్టేబుల్ జగన్ పరిచయం పెంచుకుని ప్రలోభపెట్టి లోబర్చుకున్నట్లు సమాచారం. డబ్బులు తీసుకొని తిరిగి ఇవ్వమంటే తప్పించుకొని తిరుగుతుండటంతో బాధితురాలు అతడిపై ఫిర్యాదు చేసింది. ఇటీవల జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరం స్టేషన్‌లో పనిచేసిన భవానీసేన్ అదే స్టేషన్‌లో పనిచేసిన ఓ మహిళా హెడ్ కానిస్టేబుల్‌ను రివాల్వర్‌తో బెదిరించి మరీ లైంగికదాడికి పాల్పడ్డాడు. దీంతో అతడిని పూర్తిగా సర్వీసు నుంచి తప్పించారు. దీంతో ఏదైనా ఫిర్యాదు కోసం పోలీస్‌స్టేషన్ మెట్లెక్కాలంటేనే మహిళలు భయపడిపోతున్నారు.

దొంగలతోనే దోస్తీ..

లంచాల కోసం ఇసుకాసులతో సీఐ, ఎస్సై ర్యాంకు అధికారులు, కానిస్టేబుళ్లు అంటకాగుతున్నారనడానికి ఇటీవల వీఆర్‌కు అటాచ్ చేసిన ఉదంతమే నిదర్శనం. ఈ నెల 3న ఇసుక అక్రమరవాణాదారులతో దోస్తీ చేస్తున్నందుకు ముగ్గురు సీఐలు, 13 మంది ఎస్ఐలను వీఆర్‌కు అటాచ్ చేస్తూ మల్టీజోన్-2 ఐజీ సత్యనారాయణ ఉత్తర్వులు జారీ చేశారు. ఇదే అంశంలో ఒక సీఐని, 14 మంది ఎస్సైలను బదిలీ చేశారు . ఈ విషయంలో కిందిస్థాయి సిబ్బందిని గాడిన పెట్టాలని ఎస్పీలు, సీపీలకు ఐజీ సీరియస్‌గా వార్నింగ్ ఇచ్చారు. మల్టీజోన్-1లోని డిప్యూటీ సీఎం ఇలాఖాలో ఇసుక అక్రమ రవాణాకు అడ్డే లేదు. ఇసుక అక్రమార్కులెవరిని కదిలించినా 'డిప్యూటీ సీఎం గారి తాలూకా' అంటూ బెదిరించడం, కుదిరితే డబ్బులివ్వడం చేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. నిజామాబాద్‌కు చెందిన ఓ విభాగం డీసీపీ వ్యవహారం ఇటీవల తీవ్ర చర్చనీయాంశంగా మారింది. నగరంలోని ప్రముఖ హోటల్ నుంచే ఆయన విధులు నిర్వర్తించడం, అక్కడే మందు, విందు, చిందు, మగువ వంటివి ఏర్పాట్లు చేసుకోవడంపై 'నమస్తే తెలంగాణ' వరుస కథనాలు రాసింది. వీటికి తోడు పోలీసు స్టేషన్లలోనే ఏసీబీ అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడిన వారి కేసులు ఈ ఏడాది 50కి పైగానే ఉన్నాయి. ఈ మధ్య కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలన్నా కూడా పోలీసులకు 'స్వామి భక్తి' పెరిగిపోతున్నదని విమర్శలు వినిపిస్తున్నాయి. వారి పుట్టినరోజులు, పెండ్లి రోజులు స్టేషన్లలో నిర్వహిస్తూ అభాసుపాలవుతున్నారు. ఇటువంటి చర్యలపై డీజీపీ స్పష్టమైన ఆదేశాలు ఇవ్వకపోతే.. వ్యవస్థ ప్రతిష్ఠను మరింత దిగజార్చుతారని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.

గుర్రంపోడ్ ఎస్సై సస్పెన్షన్

నీలగిరి, అక్టోబర్14 : నల్లగొండ జిల్లా గుర్రంపోడ్ ఎస్సై వీ నారాయణరెడ్డిని సస్పెండ్ చేస్తూ ఎస్పీ శరత్‌చంద్ర పవార్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల గుర్రంపోడ్‌లో జరిగిన ఓ హత్య కేసు విచారణ సమయంలో ఎస్సై పారదర్శకంగా వ్యవహరించలేదని ఆయన పేర్కొన్నారు. విధుల్లో నిర్లక్ష్యంగా, అవినీతికి పాల్పడినట్టు విచారణలో తేలడంతో ఐజీ సత్యనారాయణ ఆదేశాల మేరకు సస్పెండ్ చేసినట్టు ఎస్పీ తెలిపారు.

రక్షక భటులా.. కిరాయి గూండాలా?

- **అలయ్..బలయ్‌లో సీఎం సెక్యూరిటీ ఓవరాక్షన్**
- **ఎక్స్ వేదికగా విరుచుకుపడిన మాడభూషి శ్రీధర్**

హైదరాబాద్, అక్టోబర్ 14 (నమస్తేతెలంగాణ): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాల్గొనే కార్యక్రమాలలో ఆయన సెక్యూరిటీ సిబ్బంది ప్రవర్తిస్తున్న తీరుపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన అలయ్..బలయ్‌లో సీఎం వస్తున్న సందర్భంలో ఆయన సెక్యూరిటీ సిబ్బంది కేంద్ర సమాచార హక్కు చట్టం మాజీ కమిషనర్ మాడభూషి శ్రీధర్ గొంతు పట్టుకొని బయటకు తోశారు. సీనియర్ జర్నలిస్టు, తెలంగాణ ఉద్యమ నాయకుడు పాశం యాదగిరి కాలును తొక్కుతూ వెళ్లిపోయారు. దీనిపై మాడభూషి శ్రీధర్ సోమవారం ఎక్స్ వేదికగా విరుచుకుపడ్డారు. 'సీఎం సెక్యూరిటీ తీరుతో అసలే అనారోగ్యంతో ఉన్న నేను ఒక దశలో ప్రాణాలు పోతాయనుకున్నా' అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. 'సీఎం చుట్టూ ఉన్నది రక్షక భటులా? రజాకారులా? ప్రైవేట్ సైన్యమా? లేదంటే కిరాయి గుండాలా?' అని ప్రశ్నించారు. ఇలాంటి వారి రక్షణలో ఉండే సీఎం ప్రజలను ఏం రక్షిస్తాడు? ప్రజాపాలన అంటే ప్రజలను హింసించడమేనా?' అని కడిగిపారేశారు.

ఇటీవలి కాలంలో తరచూ ఇదే తీరు..

సీఎం సెక్యూరిటీ సిబ్బంది తరచుగా దుడుకుగా వ్యవహరిస్తూ ప్రజాప్రతినిధులు, సామాన్యులను తీవ్ర ఇబ్బంది పెడుతున్నారు. రెండు నెలల క్రితం కాంగ్రెస్‌కు చెందిన ఓ ఎమ్మెల్యేను అధికారిక కార్యక్రమంలో సీఎం వద్దకు వెళ్లకుండా అడ్డుకున్నారు. మొన్నటి మహబూబ్‌నగర్ పర్యటన సందర్భంలోనూ కాంగ్రెస్ కీలక నేత, లోక్‌సభ సభ్యుడు, ముఖ్యమంత్రి అనుంగు అనుచరిడిగా ముద్రపడ్డ నాయకుడికి సైతం ఇదే అనుభవం ఎదురైంది. అక్కడే ఉన్న సీఎం సైతం పట్టించుకోకపోగా చూస్తూ మిన్నకుండిపోయారు. ఇలా అనేక సందర్భాల్లో సీఎం సెక్యూరిటీ సిబ్బంది ఓవరాక్షన్ చేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

కరెంట్ కోతలపై కన్నెర్ర

- **కౌటాల సబ్‌స్టేషన్ ఎదుట ధర్నా**
- **మార్కెట్ వద్ద 3 గంటలపాటు మిర్చి రైతుల రాస్తారోకో**
- **భారీగా నిలిచిన వాహనాలు**
- **ఏఈ హామీతో ఆందోళన విరమణ**
- **కేసీఆర్ సర్కారులో ఎకరాకు రూ.లక్ష ఆదాయం**
- **కాంగ్రెస్ సర్కారు గోస పెడుతున్నదని మండిపాటు**

కౌటాలలో ప్లకార్డులతో రైతులు ఆందోళన

కుమ్రం భీం ఆసిఫాబాద్ (నమస్తే తెలంగాణ)/కౌటాల, అక్టోబర్ 14: కేసీఆర్ సర్కారులో 24 గంటల కరెంట్‌తో రంది లేకుండా మిర్చి సాగు చేసి.. ఎకరాకు రూ.లక్షకు పైగా ఆదాయం పొందిన రైతాంగం.. కాంగ్రెస్ పాలనలో అష్టకష్టాలు పడుతున్నది. విద్యుత్తు ఎప్పుడు వస్తుందో.. ఎప్పుడు పోతుందో తెలియక రాత్రింబవళ్లూ చేలవద్దే పడిగాపులు కాస్తున్నది. రోజూ నాలుగు గంటలపాటు కోతలు విధించడం వల్ల పంటలు ఎండిపోయే పరిస్థితి దాపురించగా, కర్షకలోకం కన్నెర్ర చేసింది. ఈ మేరకు సోమవారం కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కౌటాల మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్ ఎదుట గుండాయి సబ్‌స్టేషన్ పరిధిలో తాటిపల్లి, గుండాయిపేట్, గుడ్లబోరి, మొగఢ్‌దగఢ్ గ్రామాలకు చెందిన దాదాపు 200 మంది రైతులు ధర్నా చేశారు. కార్యాలయంలో అధికారులెవరూ లేకపోవడంతో గంటపాటు అక్కడ ఆందోళన చేసి.. అప్పై మార్కెట్ ఏరియాలోని ప్రధాన రహదారి వరకు ర్యాలీగా వెళ్లారు. అక్కడ మరో మూడు గంటల పాటు ధర్నా చేశారు. ప్రభుత్వం కరెంట్ కోతలు విధించడమేగాక ఆ ఇచ్చే కరెంట్ కూడా రాత్రి పూట సరఫరా చేయడం, అందులోనూ లో ఓల్టేజీ సమస్య తీవ్రంగా ఉండటం వల్ల మోటర్లు కాలిపోతున్నాయంటూ ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకున్న పాపాన పోలేదని మండిపడ్డారు. గుండాయిపేట 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లో బూస్టర్ చెడిపోయి ఏడాది కావస్తున్నా మరమ్మతులు చేయలేదని, అందువల్లే ఈ సమస్య తలెత్తిందని, తమ సమస్య తీరే వరకూ ధర్నా విరమించేది లేదని భీష్మించుక్కూర్చున్నారు. రెండు రోజుల క్రితం గుండాయిపేట్‌కు చెందిన నాగుపురే పాండురంగ్ అనే రైతు మిర్చి పంటకు నీరు పెట్టేందుకు రాత్రి 12 గంటలకు వెళ్లి పాము కాటుకు గురయ్యాడని, సకాలంలో దవాఖానకు తరలించడం వల్ల ప్రాణాలు దక్కాయని పేర్కొన్నారు. విద్యుత్తు కనెక్షన్‌ల కోసం లక్షలాది రూపాయల డీడీలు కట్టించుకున్నారని, పంట పెట్టుబడి కోసం అనేక అప్పులు చేశామని, ఇప్పుడేమో అధికారులు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ఇక ఇండ్లకు సరఫరా చేసే కరెంటు సమస్య కూడా తీవ్రంగా ఉందని, దోమల బెడద ఎక్కువై అనేక మంది జ్వరాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ధర్నాతో దాదాపు కిలోమీటర్ మేర వాహనాలు నిలిచిపోవడంతో పోలీసులు అక్కడికి చేరుకొని రైతులకు నచ్చజెప్పే ప్రయత్నం చేసినా వినిపించుకోలేదు. విద్యుత్తు అధికారుల నుంచి లిఖిత పూర్వకంగా లేఖ రాసిస్తేనే ధర్నా విరమిస్తామని స్పష్టంచేశారు. చివరకు ఏఈ రవీందర్ అందుబాటులో లేకపోవడంతో మంగళవారం సమస్య పరిష్కరిస్తామని ఆయన వాట్సాప్ ద్వారా మెస్సేజ్ పంపడంతో రైతులు ధర్నా విరమించారు. విర్దండి, తుమ్డిహట్టి, పార్డీ, బాలెపల్లి తదితర గ్రామాల రైతులు, మాజీ ప్రజా ప్రతినిధులు మద్దతు పలికారు.

రాత్రి కరెంట్ కాడికి పోతే పాము కాటేసింది

నాకు ఐదెకరాల భూమి ఉంది. మిరప సాగు చేస్తున్న. కాంగ్రెసోళ్లు కరెంటు సరిగా ఇవ్వడం లేదు. పంట ఎండిపోతుందని రెండు రోజుల కింద రాత్రి 12 గంటలకు కరెంట్ పెట్టడానికి పోయిన. అక్కడ పాము కాటేసింది. రాత్రి పూట కరెంట్ ఇవ్వడం వల్లే అనేక తిప్పలు పడుతున్నం. బీఆర్ఎస్ ప్రభుత్వంలో కష్టాలు లేకుండే. కాంగ్రెసోళ్లు వచ్చిన్రు గోస పెడుతున్రు.

- పాండురంగ్, గుండాయిపేట, రైతు

వారంలో రెండుసార్లు మోటర్ కాలింది

నాకు 5 ఎకరాల భూమి ఉంది. మిర్చి పంట వేసిన. కరెంటు సక్కగా లేక మోటర్, స్టార్టర్, వైర్ కాలిపోయాయి. మోటర్లు నడవాలంటే 240 వాట్లకు పైగా కరెంట్ ఉండాలి. కానీ మాకు 120-140 వాట్ల కరెంట్ వస్తుంది. ఇన్నిసార్లు మోటర్లకు ఖర్చు పెట్టే స్థోమత లేక బతుకుడా.. సచ్చుడా అర్థమైతలేదు. అధికారులు స్పందించి న్యాయం చేయాలి.

- దంద్రె ప్రవీణ్, రైతు, గుడ్లబోరి

పత్తి కొనుగోళ్లు ఏమాయే...?

- **ఓపెన్‌కాని సీసీఐ కొనుగోళ్లు**
- **సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ లేదు..జిన్నింగ్ మిల్లులతో ఒప్పందాల్లేవు**
- **మద్దతు ధర రూ.7521.. 'ప్రైవేట్' ధర రూ.6500**
- **రాష్ట్రవ్యాప్తంగా 25 లక్షల టన్నుల ఉత్పత్తి అంచనా**

హైదరాబాద్, అక్టోబర్ 14(నమస్తే తెలంగాణ): తెల్లబంగారాన్ని పండిస్తున్న రైతాంగాన్ని ప్రభుత్వం ఆందోళనలోకి నెట్టేసింది. ఓ వైపు పత్తి పంట చేతికొస్తున్నా, సీసీఐ కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై దృష్టి పెట్టకపోవడం ఇందుకు కారణమవుతున్నది. బహిరంగ మార్కెట్లో పత్తి ధరలు పడిపోవడం రైతాంగాన్ని దిక్కుతోచని స్థితిలో పడేసింది. ప్రభుత్వ పట్టింపులేనితనంతో దళారులు 'ఆడిందే ఆట పాడిందే పాట' అన్నచందంగా పరిస్థితి తయారైంది. ఈ సీజన్‌లో రాష్ట్రంలో 42.23 లక్షల ఎకరాల్లో పత్తి సాగు కాగా 25.33 లక్షల టన్నులు ఉత్పత్తి అవుతుందని అధికారులు అంచనా వేస్తున్నరు.

ఎగుమతులు తగ్గి..'మద్దతు' కరువు

ప్రస్తుతం మార్కెట్లో పొడవురకం గింజ పత్తికి మద్దతు ధర క్వింటాలుకు రూ.7521, మధ్యరకం గింజకు రూ.7121 దర ఉంది. అంతర్జాతీయ మార్కెట్లో పత్తికి డిమాండ్ పడిపోవడం, మన పత్తికి ప్రధాన మార్కెటైన బంగ్లాదేశ్‌లో అల్లర్లు, చైనా, వియత్నాం, పాకిస్థాన్‌లో నెలకొన్న పరిస్థితులు, ఇతర దేశాల్లో యుద్ధ వాతావరణం పత్తి ధరపై ప్రభావం చూపుతున్నాయి. దీన్నే అదనుగా చేసుకొని ప్రైవేట్ వ్యాపారులు మద్దతు ధర కన్నా తక్కువగా రూ. 6500 నుంచి రూ. 7వేల వరకు చెల్లిస్తున్నారు. దీంతో రైతులు క్వింటాలుకు సగటున రూ. 500 నుంచి రూ. వెయ్యి వరకు నష్టపోతున్నారు.

సాఫ్ట్‌వేర్ లేదు.. మిల్లులతో ఒప్పందాల్లేవ్..

వరంగల్, ఖమ్మం జిల్లాల్లో పత్తి పంట కోతలు మొదలయ్యాయి. వారంలో రాష్ట్ర వ్యాప్తంగా కోతలు వేగం కానున్నాయి. అయినప్పటికీ ప్రభుత్వం కొనుగోళ్లపై చర్యలు తీసుకోలేదు. సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ కూడా చేయకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతున్నది. ఇప్పటి వరకు జిన్నింగ్ మిల్లులతోనూ ఒప్పందం పూర్తికాలేదు. ఇందుకు సంబంధించి ఆయా జిల్లాల కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేసినా ఇప్పటి వరకు ఎక్కడా ఒప్పందాలు జరగలేదు. ఇప్పటివరకు ఒక్క కొనుగోలు కేంద్రం కూడా ప్రారంభించలేదు. కేజీ పత్తి కొనలేదు. మరోవైపు తమ సమస్యలు పరిష్కరించే వరకూ ఒప్పందాలు చేసుకోబోమని జిన్నింగ్ మిల్లుల యజమానులు బెట్టుజేశారు. ఇటీవల వ్యవసాయ శాఖ రంగంలోకి దిగి చర్చలు జరపడంతో ఒప్పుకున్నారు. రాష్ట్రంలో 351 జిన్నింగ్ మిల్లులు ఉండగా, 319 మిల్లులు మాత్రమే కొనుగోళ్లు చేపట్టేందుకు ఒప్పుకున్నట్టు సమాచారం.

రంగు మారితే..?

గతనెలలో కురిసిన వర్షాలతో పత్తి పంట దెబ్బతిన్నది. ముఖ్యంగా ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల్లో భారీ వర్షాలతో పత్తి రైతు కుదేలయ్యాడు. వానల నేపథ్యంలో రంగు మారిన పత్తిని ప్రభుత్వం కొంటుందా.. లేదా అనేది అనుమానంగానే ఉంది. మరోవైపు సీసీఐ మాత్రం రంగుమారిన పత్తిని కొనేది లేదని తేల్చిచెప్పింది. మరి దీనిపై ప్రభుత్వం ఎలా స్పందిస్తుందోనని రైతన్నలు ఎదురు చూస్తున్నారు. తేమ 8శాతం ఉంటేనే మద్దతు ధర లభిస్తుందని సీసీఐ చెబుతుండగా, ఎక్కువ ఉంటే మాత్రం కోతలు తప్పేలా లేవు. ఒక్కో శాతం తేమకు మద్దతు ధరలో ఒక్కో శాతం కోత పెట్టనున్నట్టు తెలుస్తున్నది.

పారిశ్రామిక వాడల్లో పవర్ కట్‌కట!

- **పడిపోతున్న పారిశ్రామిక ఉత్పత్తి**
- **వేసవికి 4 నెలల ముందే తిప్పలు**
- **నిధుల కొరత, నిర్వహణ లేకే సమస్య**
- **ఆందోళనలో పారిశ్రామికవేత్తలు**
- **మళ్లీ జనరేటర్లు తప్పవని ఆందోళన**



హైదరాబాద్, అక్టోబర్ 14(నమస్తే తెలంగాణ): వేసవికి ఇంకా నాలుగు నెలల సమయం ఉండగానే కరెంటు కోతలు మొదలు కావడంతో పారిశ్రామిక వర్గాల్లో ఆందోళన మొదలైంది. సమయం, సందర్భం లేకుండా గంటల తరబడిపోతున్న కరెంటు పరిశ్రమల యజమానులను కలవరపెడుతున్నది. పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో జనరేటర్ల వాడకం లేకపోవడంతో అవి తుప్పుపట్టిపోయాయి. ప్రస్తుత పరిస్థితి ఇలానే కొనసాగితే వాటికి మరమ్మతు చేసుకోవాల్సి వస్తుందని చెప్తున్నారు. పరిశ్రమ వర్గాలు తెలిపిన వివరాల ప్రకారం.. జీడిమెట్ల పారిశ్రామికవాడలో ఆదివారం మధ్యాహ్నం నుంచి సోమవారం ఉదయం వరకు విద్యుత్తు సరఫరా నిలిచిపోయింది. చర్లపల్లిలో ఆదివారం రాత్రి రెండు గంటలకుపైగా కరెంటు లేదు. బాలానగర్‌లో గత వారం వరుసగా మూడు రోజులు మధ్యాహ్న సమయాల్లో మూడు నుంచి నాలుగు గంటలపాటు విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడింది. దండు మల్కాపూర్ ఇండస్ట్రియల్ పార్క్‌లో గత మూడు నెలలుగా తరచూ గంట నుంచి రెండు గంటలపాటు విద్యుత్తు సరఫరా నిలిచిపోతున్నది. నాచారం, మల్లాపూర్, ఉప్పల్ ఇండస్ట్రియల్ ఏరియాల్లోనూ ఇదే పరిస్థితి. సహజంగా అధిక వర్షాలు, గాలిదుమారం వచ్చినప్పుడు, లేదంటే మెయింటెనెన్స్ పనుల సందర్భంగా విద్యుత్తు సరఫరాను నిలిపివేయడం, అనంతరం పునరుద్ధరించడం పరిపాటి. అయితే, వాతావరణం పొడిగా ఉన్న రోజుల్లో సైతం కరెంటు పోతున్నదని పరిశ్రమ వర్గాలు చెప్తున్నాయి. అప్రకటిత కోతల వల్ల ఉత్పత్తులపై తీవ్ర ప్రతికూల ప్రభావం పడుతున్నదని కంపెనీల యజమానులు వాపోతున్నారు. అకస్మాత్తుగా కరెంటు పోవడం వల్ల ప్లాస్టిక్ పరిశ్రమలకు అపార నష్టం వాటిల్లుతున్నదని, ప్లాస్టిక్ చాలా వృథా అవుతున్నదని పేర్కొన్నారు. ఫార్మా, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు సహా బాయిలర్లతో పనిచేసే అన్ని రకాల పరిశ్రమలపై దీని ప్రభావం పడుతున్నది. తరచూ విద్యుత్తు సరఫరా నిలిచిపోవడం వల్ల విద్యుత్తు పరికరాలు కాలిపోవడం, కరెంటు బిల్లులు ఎక్కువ రావడం వంటివి జరుగుతున్నాయి.

విద్యుత్తు పరికరాల కొరతతో ఇబ్బందులు

ఫ్యూజులు పోవడం, ట్రాన్స్‌ఫార్మర్లలో సాంకేతిక సమస్యలు తలెత్తడం వంటి కారణాలతో తరచూ విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడుతున్నది. ఉదాహరణకు ట్రాన్స్‌ఫార్మర్ నుంచి విద్యుత్తును సరఫరా చేసేందుకు సీటీపీటీ (కరెంట్ ట్రాన్స్‌ఫార్మర్ పొటెన్షియల్ ట్రాన్స్‌ఫార్మర్) జంక్షన్ బాక్స్ ఎంతో కీలకం. విద్యుత్తు శాఖే దీనిని సరఫరా చేస్తుంది. ప్రైవేటుగా కొనుగోలు చేసి ఉపయోగించే వీలులేదు. ఒకవేళ ఎక్కడైనా ట్రాన్స్‌ఫార్మర్ నుంచి కరెంటు సరఫరా నిలిచిపోతే విద్యుత్తుశాఖకు చెందిన సిబ్బంది వచ్చి దానిని మార్చే వరకు సరఫరాను పునరుద్ధరించే వీలులేదు. ఈ సీటీపీటీ జంక్షన్ బాక్స్‌లు విద్యుత్తుశాఖ వద్ద నిల్వలేవని అధికారవర్గాలు తెలిపాయి. ట్రాన్స్‌ఫార్మర్లు పాతవైపోవడం వల్ల తరచూ సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయి. వాటిని మరమ్మతు చేసేందుకు, చిన్నాచితకా పరికరాలు మార్చేందుకు విద్యుత్తు శాఖ వద్ద పరికరాల నిల్వలేదని చెప్తున్నారు. దీనివల్ల తరచూ సమస్యలు తప్పడంలేదని పేర్కొంటున్నారు. నిధుల కొరత కారణంగా కొంతకాలంగా పరికరాల కొనుగోలు నిలిచిపోయిందని, దీనివల్ల చిన్న చిన్న పరికరాలు మార్చాలన్నా ఎంతో సమయం పడుతున్నదని విద్యుత్తుశాఖ అధికారులు తెలిపారు. కొన్ని సందర్భాల్లో పరిశ్రమల వాళ్లనే ఆయా పరికరాలు తెచ్చుకోవాలని సూచిస్తున్నారు.

పదేండ్లు కొరతలేకుండా పరికరాల సరఫరా

దాదాపు పదేండ్ల బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో విద్యుత్తు సరఫరాకే కాదు, పరికరాలకు కూడా ఏనాడూ కొరత రాలేదని, అటు పరిశ్రమ వర్గాలు, ఇటు విద్యుత్తు శాఖ సిబ్బంది చెప్తున్నారు. సమస్యలు తలెత్తకుండా రెగ్యులర్ మెయింటెనెన్స్ ఉండేదని, అనుకోకుండా ఎక్కడైనా ఫెయిల్యూర్ సంభవించినా వెంటనే మరమ్మతులు పూర్తిచేసేవారని గుర్తుచేస్తున్నారు. పరిశ్రమల యజమానులు ట్రాన్స్‌ఫార్మర్లను ప్రైవేటుగా కొనుగోలు చేసుకుంటుండగా, సీటీపీటీ సహా వాటికి ఏర్పాటుచేసే పరికరాలను విద్యుత్తు శాఖ నుంచే సరఫరా చేసే వారు. వాటికి మరమ్మతులు చేయాలన్నా, మార్చి కొత్తవి ఏర్పాటు చేయాలన్నా విద్యుత్తు శాఖ సిబ్బందే చేయాల్సి ఉంటుంది. ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడం వల్ల ఆ శాఖ ఏ విధమైన పరికరాలనూ కొనుగోలు చేయలేకపోతున్నదని, దీనివల్ల ఎక్కడ ఫెయిల్యూర్స్ ఏర్పడినా మరమ్మతులు చేసేందుకు ఎంతో జాప్యం జరుగుతున్నదని అధికారులు చెప్తున్నారు. ఫెయిల్యూర్స్‌కి నిర్వహణ లోపం ప్రధాన కారణమని వివరించారు.



శ్రీపాల్‌రెడ్డి



మహేందర్‌రెడ్డి

పీఆర్టీయూటీఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థుల ఖరారు

హైదరాబాద్, అక్టోబర్ 14(నమస్తే తెలంగాణ) : వచ్చే ఏడాది ఫిబ్రవరిలో జరుగనున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాలకు పీఆర్టీయూటీఎస్ అభ్యర్థులను ఖరారు చేసింది. వరంగల్-ఖమ్మం-నల్లగొండ నియోజకవర్గం నుంచి పింగిలి శ్రీపాల్‌రెడ్డి, కరీంనగర్-మెదక్-నిజామాబాద్-ఆదిలాబాద్ స్థానం నుంచి వంగ మహేందర్‌రెడ్డిని బరిలోకి దించనున్నది. సోమవారం హైదరాబాద్‌లో నిర్వహించిన సమావేశంలో వీరి అభ్యర్థిత్వాలను అధికారికంగా నిర్ణయించినట్టు ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుల్గం దామోదర్‌రెడ్డి వెల్లడించారు.